

ప్రశాంతంగా పది పరీక్షలు

జిల్లా వ్యాప్తంగా పది పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు 269 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. - 8లో



అర్జీలు..నిరసనల హోరు

అర్జీదారులతో కలెక్టరేట్ కిక్కిరిసింది. సమస్యలు పరిష్కరించాలంటూ పలువురు నిరసనలను హోరెత్తించారు. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళవారం (సా)	సహర్ బుధవారం (ఉ)
తిరుపతి	6-26	4-58
గూడూరు	6-21	4-54

న్యూస్‌రీల్

పోలీస్ గ్రీవెన్స్‌కు 92 అర్జీలు



మృతుడి తల్లికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎస్పీ

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 92 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. ఇందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఉన్నాయన్నారు. వెంటనే సంబంధిత అర్జీలు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ఇటీవల ఏఆర్పీసీ(3786) అనిల్‌కుమార్ అనారోగ్యంతో మృతిచెందారు. ఈ మేరకు ఎస్పీ చేతుల మీదుగా మృతుడి తల్లి సుశీలమ్మకు రూ.50 వేలను అందజేశారు.

మహిళలకు భరోసా శక్తి

మహిళలకు మేమున్నామని భరోసా కల్పించే విధంగా ఉండడమే శక్తి టీం ఉద్దేశమని ఎస్పీ పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్షకు 125 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా 14 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ప్రథమ సంవత్సర విద్యార్థులకు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్, బ్రిడ్జి కోర్సు మ్యాథ్‌మెటిక్స్(బైపీసీ) సబ్జెక్టుల్లో పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు జనరల్ 41 మంది, ఒకేషనల్‌లో 1,070 మంది, జనరల్ బ్రిడ్జి కోర్సులో 47 మంది, మొత్తం 1,158మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉంది. అయితే వీరిలో 125 మంది గైర్హాజరైనట్టు ఆర్ఐఓ జీవీ. ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం ద్వితీయ సంవత్సర విద్యార్థులకు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్, బ్రిడ్జి కోర్సు మ్యాథ్‌మెటిక్స్(బైపీసీ) సబ్జెక్టుల్లో పరీక్షను నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 9 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 82,721 మంది స్వామివారిని దర్శించుకోగా 27,261 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.46 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 10 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.



అధికారుల కోసం నిరీక్షిస్తున్న అర్జీదారులు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

అర్జీ అగచాట్లు!

కుటుంబ పెద్దను కోల్పోయిన వారు కొందరు .. జీవిత చరమాంకంలో బిడ్డల ఆదరణ లేని పండుటాకులు మరికొందరు.. దీర్ఘకాలిక వ్యాధులతో మంచం పట్టిన విధి వంచితులు ఇంకొందరు.. కాళ్లుచేతులు చచ్చుబడి లేవలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్న అభాగ్యులు ఎందరో.. పింఛనోరామ'చంద్ర' అంటూ గగ్గోలు పెడుతున్నారు. అర్జీలు చేతబట్టి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. కూటమి కాలకేయుల చేతిలో ఆక్రమణకు గురవుతున్న భూములు, శ్మశానాలను కాపాడండి 'బాబూ'..! అంటూ అధికారులను వేడుకుంటున్నారు. భూ సమస్యలు పరిష్కారం చూపండి సారూ..అంటూ కలెక్టరేట్‌కు క్యూ కడుతున్నారు. కానీ వీరి వేదన అరణ్యరోదనగా మారుతోంది. అర్జీలు సమర్పించడం తప్ప పరిష్కారం మాత్రం దొరకనంటోంది. పేరుకే 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక' అంటూ నేతలు, అధికారులు గొప్పలు చెప్పుకుని జబ్బలు చరచడం తప్ప చొరవ చూపే నాథుడే లేరని పలువురు విమర్శలు గుప్పించడం పరిపాటిగా మారింది. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో అర్జీదారుల అగచాట్లపై 'సాక్షి'స్పెషల్ ఫోకస్.

– తిరుపతి అర్బన్/తిరుపతి సిటీ

ప్రజాసమస్యల పరిష్కారవేదికకు ఇబ్బడిముబ్బడిగా వినతులు

- కూమిట ప్రభుత్వంలో ఇంతవరకు అందని కొత్త పింఛన్లు
- అర్జీల స్వీకరణకే పరిమితమవుతున్న అధికారులు
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న అభాగ్యులు
- కలెక్టరేట్‌కొచ్చినా కనికరం లేదంటూ నిట్టూర్పులు

షరామామూలే

సోమవారం జరిగిన గ్రీవెన్స్ కూడా తూతూమంత్రంగా నిర్వహించి చేతులు దులుపుకున్నారు. ఎండ వేడిమికి తట్టుకోలేక అంధులు, వికలాంగులు, పండుటాకులు, చంటిబిడ్డ తల్లులు విలవిల్లాడడం కనిపించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు 36,606 అర్జీలు వచ్చినట్టు అధికారులు వెల్లడించారు. ఇందులో 74 శాతం సమస్యలు పరిష్కారమైనట్టు లెక్కలు చెప్పారు. వాస్తవంగా ఇందులో 30 శాతానికి మించి సమస్యలు పరిష్కారం కాలేదని అర్జీదారులు చర్చించుకోవడం కనిపించింది.

పరిష్కారమేదీ?

వచ్చిన వినతులపై సంతకం చేయడం .. రిసీప్ట్ అందించడం మాత్రమే చేస్తున్నారు. సోమవారం వచ్చిన సుమారు 250 అర్జీలలో 165 వినతులు రెవెన్యూకు సంబంధించినవి ఉన్నట్టు తేల్చారు. వాటికి పరిష్కారం చూపలేదు. మీ మొబైల్‌కు ఫోన్ వస్తుందని మాత్రమే సమాధానం చెప్పి పంపించేశారు.

భర్త చనిపోయాడు!



- వాకాడు మండలానికి చెందిన బత్తెల కమలమ్మ భర్త తొమ్మిది నెలల క్రితం చనిపోయాడు. అప్పటి నుంచి వితంతు పింఛన్ కోసం అర్జీ పట్టుకుని తిరగని కార్యాలయం లేదు. కలవని అధికారి లేడు. తీరా సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. భర్త చనిపోయి ఆర్థికంగా చితికిపోయినట్టు వెల్లడించారు. 'ఓకే మేము పరిశీలిస్తాం.. సంబంధిత అధికారికి పంపుతాం..' అంటూ అధికారులు సమాధానం ఇచ్చి పంపారు. ఎక్కడికెళ్లినా పరిష్కారమార్గం చూపడం లేదని ఆమె ఆవేదనతో వెనుదిరిగారు.

శ్మశానానికి దారేది?



- శ్రీకాళహస్తికి చెందిన పి.నరసింహారెడ్డి స్వర్ణముఖి పరిసర ప్రాంతాల్లోని శ్మశానాన్ని కొందరు ఇసుకాసురులు తవ్వేస్తున్నారని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. గతంలో పలుమార్లు శ్రీకాళహస్తి ఆర్డీఓ, ఎమ్మార్వో కార్యాలయాల్లో తెలియజేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. స్వర్ణముఖి నదీతీర ప్రాంతంలో మకాం వేసి శ్మశానాన్ని సైతం వదలడం లేదని పేర్కొన్నారు. శ్మశానాన్ని పరిరక్షించాలని వినతి పత్రం సమర్పించారు. 'సరే..అధికారులకు పంపుతాం' అంటూ ఫిర్యాదుదారునికి రిసిప్ట్ ఇచ్చి పంపారు.

సోమవారం జరిగిన గ్రీవెన్స్ తీరు..

- ఉదయం 7 గంటలకే జిల్లా నలుమూలల నుంచి కలెక్టరేట్‌కు సుమారు 250 మంది అర్జీదారులు వచ్చారు.
- 9.30 గంటలకు అధికారుల రాక ప్రారంభం
- 10 గంటలకు సుమారు 900 మంది అర్జీదారులు చేరుకున్నారు.
- 10.30 గంటలకు అధికారులు ప్రజాసమస్యల పరిష్కార వేదిక వద్దకు చేరుకున్నారు.
- 10.30 డీఆర్వో, జాయింట్ కలెక్టర్ ప్రజల నుంచి వినతిపత్రాలను, ఫిర్యాదులను స్వీకరించడం ప్రారంభించారు.
- 11.30 కలెక్టర్ వినతులను పరిశీలించారు.
- 1.20కి వరకు సుమారు 250 వినతులను స్వీకరించి ప్రజాసమస్యల పరిష్కార వేదికను ముగించారు.



పింఛన్ల కోసం కలెక్టరేట్‌కు వచ్చిన మహిళలు



సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌కు క్యూ కడుతున్న మహిళలు



అర్జీలను పరిశీలిస్తున్న జేసీ శుభం బన్సల్

జిల్లాలో గత 9 నెలల కాలంలో వచ్చిన అర్జీలు

రెవెన్యూ	24,185
సర్వే, ల్యాండ్ విభాగం	4,836
పోలీసు విభాగం	1,924
పంచాయతీ రాజ్	1,755
మున్సిపల్ పరిపాలన	1,097
సివిల్ సప్లై	327
హౌసింగ్	272
విద్యుత్	221
గ్రామీణాభివృద్ధి	172
నీటిసరఫరా విభాగం	132
రిజిస్ట్రేషన్, స్టాంప్స్	119
సోషల్ వెల్ఫేర్	116
ఇతర విభాగాలకు సంబంధించి	1,450
మొత్తం	36,606

పింఛన్ కోసం తిరుగుతున్నా



వృద్ధాప్య పింఛన్ కోసం కొన్ని వారాలుగా తిరుగుతూనే ఉన్నా. నాకు న్యాయం చేయాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదు. కలెక్టరేట్‌లోనైనా న్యాయం జరుగుతుందనే ఉద్దేశంతో ఇక్కడి వచ్చా.

– యు.రమణయ్య అచ్చారి, పెద్దపాలేదు, బుచ్చినాయుడుకండ్రిగ మండలం

శ్మశాన వాటికకు దారిలేదు



మా కాలనీకి చెందిన శ్మశానికి వెళ్లడానికి దారి లేదు. నానా ఇక్కట్లు పడుతున్నాం. గ్రామ స్థాయి నుంచి మండల, డివిజన్ స్థాయి వరకు అధికారులకు మొరపెట్టుకున్నాం. ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పుడు కలెక్టరేట్‌లో అర్జీ ఇచ్చాం.

–మునికృష్ణయ్య, పెనుమల్లం, ఏర్పేడు మండలం

నా భర్తకు పక్షవాతం వచ్చింది



నా భర్తకు పక్షవాతం వచ్చింది. మంచానికే పరిమితమయ్యాడు. పింఛన్ కోసం ఆరు నెలలుగా తిరుగుతున్నాం. కనీసం ఆయన మందులకు కూడా డబ్బుల్లేవు. చాలా ఇబ్బందులు పడుతున్నాం. – భర్త కోటయ్యతో రమణమ్మ, జాండ్రపేట, వాకాడు మండలం

నా భూములు ఆక్రమించారు



నా భూమిని ఆక్రమించారు. స్థానిక రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వారు పట్టించుకోవడం లేదు. విచారణ చేసి మాకు న్యాయం చేయాలని కోరుతున్నాం. – కోదండరామయ్య, పీఎస్ పాళెం, చిన్నగొట్టిగల్లు మండలం

కోర్సుల్లో కోత..
విద్యార్థులకు వాత!

- 30 శాతం కంటే తక్కువ విద్యార్థులు ఉన్న కోర్సులపై ఆరా
- నివేదిక ఇవ్వాలంటూ విభాగాధిపతులకు ఆదేశాలు
- 2025–26 విద్యాసంవత్సరంలో పలు కోర్సులకు కత్తెర పడే అవకాశం
- ఎస్వీయూలో ఇదీ పరిస్థితి



ఎస్వీయూ ప్రధాన ద్వారం

తిరుపతి సిటీ: రాయలసీమకే తలమానికంగా నిలిచిన శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పలు కోర్సులకు కత్తెర వేసే దిశగా అడుగులు వేస్తున్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే సాకుతో కోర్సుల్లో కోత విధించేందుకు అధికారులు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. ఎస్వీయూలో ప్రస్తుతం 56 విభాగాలలో 3 వేల మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇందులో విద్యార్థుల సంఖ్య 30 శాతం కంటే తక్కువగా సుమారు 10 కోర్సులు ఉన్నట్లు తెలుస్తోంది. తక్కువగా ఉన్న కోర్సులను ఇతర కోర్సుల్లోకి మెర్జ్ చేయడం లేదా తొలగించాలనే ప్రయత్నంలో వర్సిటీ అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. తక్కువ ప్రవేశాలు ఉన్న కోర్సుల వివరాలతో కూడిన జాబితాను తయారు చేసి సమర్పించాలని అధికారులకు లిఖిత పూర్వకంగా ఆదేశాలు అందాయి.

సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సులకు మంగళం

2025–26 ఏపీ పీజీసెట్‌లో గత 50 ఏళ్లుగా వర్సిటీలో కొనసాగుతున్న పలు కోర్సులు కనబడకపోవచ్చని అంచనా. ప్రధానంగా సైన్స్, ఆర్ట్స్, ఇంజినీరింగ్ విభాగాలలో సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సులను తొలగించే అవకాశముంది. అలాగే రెగ్యులర్ కోర్సులలో కొన్నింటిని మెర్జ్ చేయవచ్చని సమాచారం.

ప్రవేశాలను పెంచడం చేతగాకే...



ప్రవేశాలను పెంచుకోవడం చేతగాకనే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారు. ఎమ్మెస్సీ ఎలక్ట్రానిక్స్, తమిళ్, ఉమెన్ స్టడీస్ వంటి కోర్సులకు చరమగీతం పాడుతూ మరిన్ని కోర్సులను మెర్జ్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇదే జరిగితే విద్యార్థి సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏడీ బిల్డింగ్‌ను ముట్టడిస్తాం. – ఎస్.చిన్న, ఏఐఎస్‌ఏ జిల్లా కార్యదర్శి, తిరుపతి

స్వతహాగా పీజీసెట్ బెటర్



వర్సిటీ అభివృద్ధి పథంలో నడవాలంటే కోర్సులను తొలగించడం కాదు. ప్రవేశాలను ప్రోత్సహించి, స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ ఇవ్వాలి. ఉపాధి, ఉద్యోగావకాశాలను పెంచే ప్రయత్నం జరగాలి. కామన్ పీజీ సెట్‌ను రద్దు చేసి, వర్సిటీ స్వతహాగా పీజీసెట్ నిర్వహిస్తే అడ్మిషన్లు పెరుగుతాయి. – భగవత్ రవి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, తిరుపతి

ఉద్యమిస్తాం



అధికారుల నిర్లక్ష్య వైఖరితోనే విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ప్రవేశాలను పెంచుకునేందుకు ప్రయత్నం చేయాలి తప్ప, కోర్సులను తొలగించడం సరికాదు. ఇదే జరిగితే ఉద్యమిస్తాం. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందని ద్రాక్షగా చేసి కార్పొరేటీకరణ దిశగా అడుగులు వేస్తే సహించేది లేదు. – బండి చలపతి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు, తిరుపతి

హేయమైన నిర్ణయం



పేరొందిన వర్సిటీలో అడ్మిషన్లు తక్కువగా ఉన్నాయన్న కారణంగా కోర్సుల్లో కోత హేయమైన నిర్ణయం. ఇలాంటి ప్రయత్నాలను అధికారులు విరమించుకోవాలి. లేనిపక్షంలో విద్యార్థుల ఆగ్రహానికి గురికాక తప్పదు. – శివశంకర్‌నాయక్, జీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, తిరుపతి

వర్సిటీకి చెడ్డపేరు



అధికారులు విద్యను ప్రోత్సహించాలే తప్ప కోర్సులను తొలగించడం దారుణం. వర్సిటీలో ఏ కోర్సును తొలగించినా ధర్నాలు, నిరసనలు తప్పవు. ఇలాంటి దుశ్చర్యలతో వర్సిటీకి చెడ్డపేరు తేవడం దారుణం. – మల్లికార్జున, ఎస్ఎస్‌యూఐ, రాష్ట్ర కార్యదర్శి, తిరుపతి

పాళెంకోటలో 150 ఎకరాల ఆక్రమణ

- ఎస్సీలు సాగు చేసుకుంటున్న భూముల్లోనే హెచ్చరిక బోర్డులు
- టీడీపీ శ్రేణులపై జాలిచూపుతున్న రెవెన్యూ అధికారులు

ఇదెక్కడి న్యాయం?



ఆక్రమించుకుని దర్జాగా వరిసాగు చేసిన టీడీపీ శ్రేణులు



ఎస్సీలు సాగు చేసుకునేందుకు యత్నిస్తున్న భూముల్లో ఏర్పాటైన హెచ్చరిక బోర్డు

వెంకటగిరి రూరల్: పాళెంకోటలో రెవెన్యూ అధికారులు భూ వివాదానికి తెరలేపారు. ఓ వర్గం భూములు ఆక్రమించుకున్నా పట్టించుకోని అధికారులు అదే ఎస్సీలు సాగుకు యత్నించిన భూముల్లో మాత్రం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. వివరాలు.. వెంకటగిరి రూరల్ మండలం, పాళెంకోట పరిధిలో 150 ఎకరాల భూములు ఉన్నాయి. వీటిని ఇప్పటికే కొందరు టీడీపీ శ్రేణులు జేసీబీలతో చదునుచేసి దర్జాగా సాగు చేసుకుంటున్నారు. సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకుని ఏకంగా వరి పంటలు వేశారు. ఇదే పాళెంకోటకు చెందిన కొందరు ఎస్సీలు కూడా సదరు భూములను చదును చేసుకునే యత్నించారు. అయితే వారు భూములు ఆక్రమించుకుంటున్నారంటూ టీడీపీ శ్రేణులు అధికారులకు సమాచారం ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఎస్సీలు చదునుచేసుకుంటున్న భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అధికారులు చూపుతున్న వివక్షపై ఎస్సీ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అవి రెవెన్యూ భూములేనా?

పాళెంకోట శివారులో ఉన్న భూములు కొంత కాలంగా అన్యాక్రాంతమవుతున్నాయి. అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. ఎస్సీలు అడుగుపెట్టడంతో రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. 150 ఎకరాలు అటవీ భూములేనని, రెవెన్యూకి సంబంధం లేదని స్థానికులు చెబుతున్నారు. అయితే రెవెన్యూ అధికారులు కొందరు అవి అటవీ భూములని, మరికొందరు అధికారులు రెవెన్యూ భూములేనని చెబుతున్నారు. అందుకే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్టు పేర్కొంటున్నారు. బ్రిటీష్ కాలం నుంచి 150 ఎకరాల భూములకు సంబంధించి ఎటువంటి సర్వే నంబర్ లేదని స్థానికులు చెబుతున్నారు.

ప్రత్యేక నైపుణ్యమే లక్ష్యం



మాట్లాడుతున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి అర్బన్: ప్రత్యేక నైపుణ్యం సాధించడానికి ప్రభుత్వ ఉద్యోగులకు కోర్సులను ఏర్పాటు చేస్తున్నట్లు డీఆర్వో నరసింహులు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల నైపుణ్యంతో సుపరిపాలన పెంపొందించే దిశగా కోర్సులు ఉంటాయని చెప్పారు. ఐ గాట్ కర్మయోగి పోర్టల్ యాప్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మూడు రకాల కోర్సులను ప్రవేశపెట్టినట్టు వెల్లడించారు. జిల్లాలో డీడీఓలు అందరూ ఈ యాప్ గురించి అవగాహన చేసుకోవాలని చెప్పారు. ఈ కోర్సులను మార్చి 20వ తేదీ లోపు పూర్తి చేయాలని సూచించారు. లాగిన్‌కు సంబంధించిన సమస్యలు తలెత్తితే 9652171785, 9063494729 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ ట్రైనింగ్ అధికారి వెంకటేష్ , సీపీఓ ప్రేమ్‌చంద్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పునుగు పిల్లుల నివాస స్థావరాల అభివృద్ధి

తిరుమల : తిరుమల శ్రీవారి అభిషేకంలో ఉపయోగించే పునుగు తైలం కోసం తిరుపతి శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శనశాలలో పెంచుతున్న పునుగు పిల్లుల నివాస స్థావరాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. జూపార్కులో ఇప్పటికే నిర్మించిన నిశాచర జీవుల నివాస స్థావరం (నాక్టనల్ హౌస్)లో పునుగు పిల్లుల సంరక్షణకు ప్రత్యేకంగా నిర్మించిన గదులు ఇంటీరియర్ అభివృద్ధి కోసం జూ అధికారుల ప్రతిపాదనలను అనుమతిస్తూ 2024 డిసెంబర్ 24 తేదీన బోర్డు సమావేశంలో టీటీడీ అంగీకారం తెలిపింది. రూ.1,97,31,200లతో రూపొందించిన సదరు ప్రతిపాదనలను టీటీడీ రాష్ట్ర ప్రభుత్వ అనుమతి కోసం పంపింది. టీటీడీ ప్రతిపాదనలకు అంగీకారం తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది.

ఉరి వేసుకొని యువకుడి మృతి

సత్యవేడు: శ్రీసిటీ పరిధిలోని చిగురుపాళెం చెరువు కట్టపై రాజస్థాన్‌కు చెందిన ఓ యువకుడు ఉరి వేసుకుని తనువుచాలించాడు. ఈ ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. రాజస్థాన్‌కు చెందిన సిబ్ ముంజి(45) శ్రీసిటీలోని హెమల్టన్ కంపెనీలో కార్మికుడిగా ఉంటూ చిగురుపాళెం గ్రామ పరిసరాల్లో నివసిస్తున్నాడు. తనకున్న అనారోగ్య సమస్య, ఆర్థిక ఇబ్బందుల కారణంగా మద్యం తాగి గ్రామ సమీపంలోని చెరువుపై ఉన్న వేప చెట్టుకు తాడుతో ఉరివేసుకొని మృతిచెందినట్టు ఎస్‌ఐ హరిప్రసాద్, సీఐ శ్రీనివాసులు తెలిపారు. సత్యవేడు కమ్యూనిటీ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

రాయలవారి కోట సందర్శన



రాయలవారి కోట వద్ద జాతీయ బృందం సభ్యులు

చంద్రగిరి: చంద్రగిరి కోటను న్యూఢిల్లీలోని నేషనల్ డిఫెన్స్ కళాశాలకు చెందిన బృందం సోమవారం సందర్శించింది. స్టడీ టూర్లో భాగంగా చంద్రగిరి కోటను సందర్శించారు. ఏపీ మానవ వనరుల శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు నేతృత్వంలో నేషనల్ డిఫెన్స్ మేజర్ జనరల్ సీపీ సంధ్రూ, సివిల్ సర్వీసెస్ అధికారి బాలాజీ ఆధ్వర్యంలో ఇండియన్ నేవి, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్, సివిల్ సర్వీసెస్, ఇంటర్నేషనల్ అధికారులు భారతదేశానికి చెందిన 12 మంది, రష్యా, శ్రీలంక, ఇండోనేషియా, సౌతాఫ్రికా, నేపాల్ దేశాలకు చెందిన ఐదుగురు కోటను సందర్శించారు. ఏపీ టూరిజం రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, జిల్లా టూరిజం అధికారి జనార్దన్ రెడ్డి, కోట ఆర్కియాలజీ కన్జర్వేటర్ బాలకృష్ణారెడ్డి, చంద్రగిరి తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపీడీఓ వెంకటరత్నం, బృందం కో–ఆర్డినేటర్ కార్తీక్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు



తిరుపతిలోని ఓ పరీక్షా కేంద్రం వద్దకు భారీగా చేరిన విద్యార్థులు, తల్లిదండ్రులు



పరీక్ష బాగా రాయాలి తల్లీ

తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం తిరుపతి జిల్లా వ్యాప్తంగా 162 పరీక్షా కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. తొలిరోజు పదోతరగతి పరీక్షలు కావడంతో విద్యార్థులు పలు దేవాలయాల వద్ద కిటకిటలాడారు. తొలిరోజు జరిగిన తెలుగు పరీక్షకు జిల్లాలోని 26,670మంది విద్యార్థులు హాజరవ్వాలి ఉండగా వారిలో 269 మంది గైర్హాజరయ్యారు. సప్లిమెంటరీ విద్యార్థులు 133 మందికి గాను 30మంది గైర్హాజరయ్యారు. వివిధ కారణాలతో పరీక్ష రాయలేని విద్యార్థులు, దివ్యాంగ విద్యార్థులకు స్క్రైబ్‌కు అనుమతి ఇచ్చారు.

పటిష్ట బందోబస్తు

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు జిల్లా విద్యాశాఖాధికారులు పటిష్ట ఏర్పాట్లు చేపట్టారు. బయటి వ్యక్తులు లోనికి వెళ్లకుండా పరీక్షా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించారు. పరీక్ష నిర్వహణాధికారుల సెల్‌ఫోన్లను కేంద్రాల్లోకి నిషేధించారు.

ఆకస్మిక తనిఖీలు

కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ రెండు పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఈఓ కేవీఎన్.కుమార్ మూడు పరీక్షా కేంద్రాలను, జిల్లా స్థాయి పరిశీలకులు 10 పరీక్షా కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది మరో 10 మంది పది పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. అలాగే సమస్యాత్మక 30పరీక్షా కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్ విధులు నిర్వహించారు. ఎటువంటి మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్‌కు తావులేకుండా పరీక్షలను సజావుగా నిర్వహించినట్లు డీఈఓ కేవీఎన్.కుమార్ తెలిపారు.

అర్జీలు..నిరసనల హోరు

తిరుపతి అర్బన్: సమస్యలు పరిష్కరించాలంటూ పలువురు కలెక్టరేట్‌కు పోటెత్తారు. సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు జిల్లా నలుమూలల నుంచి మొత్తం 250 అర్జీలు వచ్చినట్టు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. అందులో 165 అర్జీలు రెవెన్యూ సమస్యలపైనే ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రోజ్‌మాండ్, జిల్లా అధికారుల ఆధ్వర్యంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

ఆరోగ్య మిత్రల నిరసన

కలెక్టరేట్ వద్ద ఆరోగ్య మిత్రలు నిరసన వ్యక్తం చేశారు. 17 ఏళ్లుగా పనిచేస్తున్నా క్యాడర్ అమలు చేయలేదన్నారు. ఎంటీఎస్ లేక.. ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగిగా గుర్తింపు లేక ఇక్కట్లు పడుతున్నట్టు వెల్లడించారు. మరోవైపు సీసీ కెమెరాల కింద కుర్చొని పనిచేయడం మహిళలకు ఇబ్బందిగా ఉందని ఆవేదన చెందారు. తమ సమస్యలకు పరిష్కారం చూపాలని కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు.

పెన్షనర్ల సమస్యలను పట్టించుకోండి

'మూడు దశాబ్దాలకు పైగానే ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేశాం.. కానీ రావాల్సిన బెనిఫిట్స్‌ను తీసుకోకుండానే పలువురు మృతి చెందుతున్నారు' అంటూ పలువురు పెన్షనర్లు వాపోయారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. పీఆర్సీకి సంబంధించి కమిషన్ ఏర్పాటు చేయాలని, ఐఆర్ ప్రకటించాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆరోగ్యమిత్రలు

డీఎస్సీ కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయండి

ఎస్సీ, ఎస్టీలకు చెందిన విద్యార్థులకు డీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, ఐసీ, జీఎస్ఎస్, నల్సా విభాగాలకు చెందిన విద్యార్థులు డిమాండ్‌చేశారు. ఆ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు.

రైలులో నుంచి పడి యువకుడి మృతి

చిల్లకూరు: చిల్లకూరు మండలం, తీపనూరు సమీపంలో 33 ఏళ్ల ఉన్న గుర్తుతెలియని యువకుడు రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. చెన్నై వైపు వెళ్లే రైలులో నుంచి తీపనూరు సమీపంలో ఓ యువకుడు కింద పడిపోయాడు. ప్రయాణికులు గుర్తించి 100కు సమాచారం అందించారు. దీంతో వారు చిల్లకూరు పోలీసులను అప్రమత్తం చేశారు. తర్వాత 108 వాహనంలో యువకుడ్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. చిల్లకూరు పోలీసులు గూడూరు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు విచారణ చేస్తున్నారు. మృతుని గుంటూరు ప్రాంతం అని రైల్వే పోలీసులు గుర్తించినా పూర్తి వివరాలు తెలియలేదు.



గాయపడ్డ యువకుడిని ఆస్పత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్న 108 సిబ్బంది

తిరుపతికి నీటి సరఫరా, మురుగునీటి ప్రాజెక్టులు

సాక్షి, న్యూఢిల్లీ: తిరుపతి నగరానికి నీటి సరఫరా, మురుగునీరు సెప్టేజ్, తుపాను నీటి పారుదల, పార్క్ ప్రాజెక్టులు మంజూరు చేసినట్లు కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి టోకాన్ సాహు తెలిపారు. సోమవారం ప్రశ్నోత్తరాల్లో వైఎస్సార్ సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన రాతపూర్వకంగా సమాధానమిచ్చారు.

సెల్‌ఫోన్ రిపేర్, సర్వీసింగ్‌లపై ఉచిత శిక్షణ

చంద్రగిరి: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో ఈనెల 25 నుంచి 30 రోజుల పాటు పురుషులకు సెల్‌ఫోన్ రిపేరు, సర్వీసింగ్‌లపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు సంస్థ డైరెక్టర్ పి. సురేష్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 ఏళ్లలోపు ఉన్న పురుషులు అర్హులన్నారు. కనీసం విద్యార్హత 10వ తరగతి అని, శిక్షణ సమయంలో అభ్యర్థులకు ఉచిత భోజన వసతి కల్పిస్తామని, రానూ పోనూ ఒక్కసారి చార్జీలు ఇస్తామన్నారు. అలాగే శిక్షణానంతరం ధ్రువ పత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆధార్, రేషన్ కార్డు జెరాక్స్‌లు, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సంస్థకి వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని, తొలుత పేర్లు నమోదు చేసుకున్న ప్రాధాన్యత ఇస్తామన్నారు. మరిన్ని వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11–48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట , చంద్రగిరి. ఫోన్: 79896 80587, 94949 51289, 63017 17672 సంప్రదించాలని సూచించారు.

మధ్యవర్తిత్వంపై శిక్షణ



జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణా తరగతులను ప్రారంభిస్తున్న జడ్జి గురునాథ్

తిరుపతి లీగల్: రాష్ట్ర, జిల్లా న్యాయసేవా సంస్థల ఆదేశాల మేరకు తిరుపతి మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 44 మంది న్యాయవాదులకు సోమవారం నుంచి మధ్యవర్తిత్వంపై శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. స్థానిక రాస్ భవనంలో జరుగుతున్న ఈ శిక్షణ కార్యక్రమానికి తిరుపతి మూడవ అదనపు జిల్లా జడ్జి ఎం.గురునాథ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శిక్షణ తరగతులు ఈనెల 21వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఢిల్లీకి చెందిన సీనియర్ న్యాయవాది అనుజ సక్సేన, మధ్యప్రదేశ్‌కు చెందిన న్యాయవాది, సామాజిక కార్యకర్త నీనాకరే మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయ సేవ సంస్థ కార్యదర్శి ఎమ్ఎస్ భారతి, న్యాయవాదులు పాల్గొన్నారు.

పోలీసుల్లో 'ఫైర్' ఉండాలి



ఫైరింగ్‌లో శిక్షణ పొందుతున్న అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



తాను ఫైరింగ్ చేస్తే టార్గెట్‌లో బుల్లెట్ ఎక్కడ దిగిందో ఆసక్తిగా పరిశీలిస్తున్న ఎస్పీ

● ఫైరింగ్ శిక్షణలో ఎస్పీ దిశానిర్దేశం

చంద్రగిరి: వార్షిక ఫైరింగ్ శిక్షణలో ప్రతి ఒక్కరూ ఉత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆకాంక్షించారు. కల్యాణీ డ్యామ్‌లో నిర్వహిస్తున్న ఫైరింగ్ శిక్షణను సోమవారం ఆయన పరిశీలించారు. అత్యాధునిక ఆయుధాలతో ఫైరింగ్ ప్రాక్టీస్ చేసి ఆయన సిబ్బందిలో ఉత్సాహం నింపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణలో సాయుధ దళ పోలీసుల సేవలు చాలా కీలకమని, ఫైరింగ్ రేంజ్‌లో అధికారుల పర్యవేక్షణలో జాగ్రత్తగా ప్రాక్టీస్ చేసి నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. ఆ తర్వాత ఏఆర్ పోలీసు అధికారులు, సిబ్బందితో ఫైరింగ్ శిక్షణపై మాట్లాడారు. ప్రతి బుల్లెట్ టార్గెట్ (లక్ష్యం) వైపే బుల్ పడేలా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని జిల్లా పోలీసు శాఖ ఉన్నతి కోసం ముందడుగు వేయాలన్నారు. తిరుపతి జిల్లా రాష్ట్రంలోనే అతి పెద్ద జిల్లా అని, ప్రపంచ ప్రసిద్ధి గాంచిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ఉండడంతో వీవీఐపీలు, వీఐపీలు సరైన భద్రత, మరో వైపు ప్రజా రక్షణను దృష్టిలో ఉంచుకుని ఫైరింగ్ శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. సివిల్ పోలీసులు 1500మంది, ఆర్మ్‌డ్ సిబ్బంది 640మంది, సీఐలు 36, డీఎస్పీలు 11, ఎస్ఐలు 67మంది, అడిషనల్ ఎస్పీలు 4 ఫైరింగ్‌లో శిక్షణ పొందినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ అధికారి హేమంత్, అదనపు ఎస్పీలు రామకృష్ణ, నాగభూషణం, శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

అష్టబంధన మహా సంప్రోక్షణ

తిరుపతి కల్చరల్: అలిపిరి పాదాల మండపంలోని శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో సోమవారం శాస్త్రోక్తంగా అష్ట బంధన మహా సంప్రోక్షణ నిర్వహించారు. అలిపిరి పాదాల మండపం వద్దనున్న స్వామి వారి ఆలయం, శ్రీలక్ష్మీ నారాయణస్వామి వారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీగోదా అమ్మవారి ఆలయంలో అష్టబంధన మహా సంప్రోక్షణ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా యాగశాలలో వైదిక కార్యక్రమాలు, మహా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం కుంభ ప్రదక్షిణ చేపట్టారు. ఆలయ డెప్యూటీ ఈఓ శాంతి, రుత్వికులు పాల్గొన్నారు.



అలిపిరి పాదాల మండపంలోని స్వామి ఆలయంలో అష్టబంధన, మహాసంప్రోక్షణ చేపడుతున్న అర్చకులు

'క్షయ'పై అవగాహన తప్పనిసరి



క్షయవ్యాధి దినోత్సవ బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: క్షయవ్యాధి నిర్ధారణతోపాటు నివారణపై అవగాహన ఉండాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. ఈ నెల 24న ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం నేపథ్యంలో కలెక్టరేట్‌లో సోమవారం నిర్మూలనకు చెందిన ఓ బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. క్షయ వ్యాధి నిర్ధారణ, చికిత్స గురించి ప్రజల్లో అవగాహన పెంచాల్సి ఉందన్నారు. జిల్లాలో 24 పంచాయతీలను టీబీ ముక్త్ పంచాయతీలుగా గుర్తించినట్టు వెల్లడించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలకృష్ణనాయక్, వైద్యులు శ్రీనివాసులురెడ్డి, సుబ్బారావ్, రవిరాజు, రాజా పాల్గొన్నారు.

నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వండి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీలు

తిరుపతి అర్బన్: వినియోగదారులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సూచించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌తోపాటు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ రిసోర్స్ పర్సన్ జనార్ధన్‌తో కలిసి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఆధర్వంలో పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. రిసోర్స్ పర్సన్ డా.యాసుఫ్, చెంచయ్య పాల్గొన్నారు.

వేదాల పరిరక్షణకు కృషి



శోభాయాత్రలో అతిథులు, పండితులు, విద్యార్థులు

● కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతిస్వామి పిలుపు

తిరుపతి సిటీ: గ్రామ స్థాయి నుంచి దేశంలోని అన్ని ప్రాంతాలలో వేదాల పరిరక్షణకు కృషి చేయాలని కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతిస్వామి పిలుపునిచ్చారు. ఎస్వీ వేదిక్ వర్సిటీ, మహర్షి సాందీపని వేద విద్యా ప్రతిష్ఠాన్ సంయుక్త ఆధ్వర్యంలో వేదిక్ వర్సిటీలో మూడు రోజుల వేద సమ్మేళనం సోమవారం ఘనంగా ప్రారంభమైంది.వర్సిటీలో వేదపండితులు, అతిథులు, విద్యార్థులు పెద్ద ఎత్తున శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన వర్చువల్ విధానంలో ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. వేదాల రక్షణే లోకరక్షణగా భావించాలన్నారు. వేదాలతో జ్యోతిష్యం, పురాణాలు, ఇతిహాసాలు, నీతి శాస్త్రం, యోగ శాస్త్రం అనుసంధానం చేసి వాటి సారాన్ని సమాజానికి అందించాలన్నారు. విశిష్ట అతిథులు, ఎస్ఎస్‌యూ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, వేదిక్ వర్సిటీ వీసీ రాణిసదాశివమూర్తి, సాందీపని రాష్ట్రీయ వేద విద్యా ప్రతిష్ఠానం సచివులు ఆచార్య విరూపాక్ష జడ్డీపాల్ ప్రసంగించారు. వేదాలు మానవ జీవన విధానాన్ని తెలియజేస్తాయని, వేద పరిరక్షణతోనే దేశ పరిరక్షణ సాధ్యమన్నారు. ధార్మిక చైతన్యం పెరగాలని, వేదం అభ్యసించిన వారు సైనికుల్లా దేశ పరిరక్షణలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ భాస్కరుడు, గణేష్‌భట్, పీఆర్‌ఓ టి.బ్రహ్మాచారులు, వివిధ రాష్ట్రాలకు చెందిన వేద పండితులు పాల్గొన్నారు.

28 మందికి జరిమానా

తిరుపతి లీగల్: మద్యం తాగి తిరుపతిలో వాహనాలు నడుపుతున్న 28 మందికి ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పినట్టు కోర్టు సూపరింటెండెంట్ ఎన్వీ సుబ్బారెడ్డి తెలిపారు. తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, డీఎస్పీల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించినట్టు కోర్టు కానిస్టేబుల్ గిరిబాబు తెలిపారు.

వెదురు పెంపకంపై అవగాహన

తిరుపతి అర్బన్: వెదురు పంట సాగుకు రాయితీలున్నాయని జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి తెలిపారు. తిరుపతిలోని అటవీశాఖ బయోట్రిమ్ కార్యాలయంలో రైతులకు వెదురు సాగుపై అవగాహన కల్పించారు. తిరుపతితోపాటు చిత్తూరు, నెల్లూరు, అన్నమయ్య జిల్లాలకు చెందిన రైతులు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జాతీయ వెదురు మిషన్ పథకం ద్వారా ఒక హెక్టార్లు సాగుకు రూ.50 వేల రాయితీ ఉందని చెప్పారు. అలాగే నర్సరీ సాగుచేస్తే హెక్టార్‌కు రూ.20 లక్షలు గరిష్ఠంగా అందిస్తారని వివరించారు. ఉదయగిరి అగ్రికల్చర్ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి వెదురుపై రైతులకు అంశాల వారీగా వివరించారు.



మాట్లాడుతున్న ఉద్యానశాఖ జిల్లా అధికారి దశరథరామిరెడ్డి

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నూతన ఒరవడి

– తిరుపతి ఐఐటీ ఇన్నోవేషన్ హబ్‌ను సందర్శించిన డీఎస్టీ సెక్రటరీ



ఆపరేషన్ ద్రోణగిరి బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అభయ్ కరండెకర్, ఐఐటీ డైరెక్టర్

ఏర్పేడు(రేణిగుంట): ఆపరేషన్ ద్రోణగిరితో భౌగోళిక స్థాన సంబంధిత విధానం అమలుతో దేశంలోని శాస్త్ర, సాంకేతిక రంగాలలో నూతన ఒరవడి చోటుచేసుకోనుందని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి అభయ్ కరండేకర్ అన్నారు. ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీ ప్రాంగణంలోని టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్‌లో జరుగుతున్న డెమోడే షోకేస్ ఈవెంట్‌లో ఆయన సోమవారం పాల్గొన్నారు. ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్ఎం– ఐసీపీఎస్ మిషన్ డైరెక్టర్ ఏక్తా కపూర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ జాయింట్ సెక్రటరీ ధనలక్ష్మి, జీడీపీడీసీ చైర్మన్ శ్రీకాంత్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల పురోభివృద్ధికి అలవంభించాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ రోషన్ శ్రీవాస్తవ్ కొత్త ప్రాజెక్టుల గురించి వివరించారు. జియోస్పేషియల్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకురావటానికి 25 అగ్ర స్టార్టప్‌లను గుర్తించినట్లు వెల్లడించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


పెళ్లకూరు: మండలంలోని ముమ్మారెడ్డిగుంట గ్రామానికి చెందిన చింతపూడి హరీష్(18) సోమవారం అక్కగారిపేట గ్రామ సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్ఐ నాగరాజు కథనం మేరకు.. చిన్నతనంలోనే హరీష్ తల్లిదండ్రులను కోల్పోయాడు. ముమ్మారెడ్డిగుంట గ్రామంలోని మేనమామ ఆనంద్ వద్ద ఉంటున్నాడు. అయితే గత కొంత కాలంగా మద్యానికి బానిసై అక్కగారిపేట గ్రామ సమీపంలో అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి ఎస్ఐ చేరుకుని 108 సహాయంతో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. హరీష్ అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కేసు దర్యాప్తులో ఉంది.



మృతి చెందిన హరీష్

సూర్యప్రతాపం!







తిరుమలలో సూర్యతాపం పెరిగిపోయింది. శేషాచల ఏడుకొండల్లోనూ వడగాడ్పులు, ఉక్కపోత తీవ్రమైంది. శ్రీవారి దర్శనానంతరం భక్తులు ఆలయం వెలుపల పరుగులు తీయడం కనిపించింది. టీటీడీ అధికారులు కూల్‌పెయింట్ వేసి చర్యలు చేపట్టినా అవస్థలు పడాల్సి వస్తోంది. భక్తులు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో కూల్‌పెయింట్ వేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి